# 3

# అపొస్తలుడైన పౌలు మార్పు

*“ఆకాశమునుండి కలిగిన ఆ దర్శనమునకు నేను అవిధేయుడను కాక ... వారు మారుమనస్సు పొంది దేవునితట్టు తిరిగి మారుమనస్సుకు తగిన క్రియలు చేయవలెనని ప్రకటించుచుంటిని” (అపొస్తలుల కార్యములు 26:19, 20).*

అపొస్తలుడైన పౌలు మార్పు అపొస్తలుల కార్య గ్రంథములో బహు ఆసక్తిని రేకెత్తించేదియు, బాగుగా ఎరుగబడిన కథయునైయున్నది. పౌలు కథ ముమ్మారు చెప్పబడింది: ఒకటి సంభవించిన తీరులో (9:1–18), రెండుసార్లు అది యితరులకు చెప్పిన తీరులో (22:1–16; 26:1–23). అపొస్తలుల కార్యములు 22లో వివరమైన వర్ణన, యెరూషలేములో తనపై దాడి చేసిన యూదా మూక ఎదుట తన్నుగూర్చి జవాబు చెప్పుకునే సందర్భంలో యియ్యబడింది.

క్రీస్తును వెంబడించినవారిని హింసించిన అత్యాసక్తిగల యూదుడుగా ఆ జన సమూహానికి పౌలు తన్నుతాను పరిచయం చేసికొన్నాడు. ఇతర క్రైస్తవులను హింసించే, చెరసాలలో వేయించే పన్నాగంతో వెళ్లుతున్న దమస్కు మార్గంలో ఏమి సంభవించిందో అతడు తెలియజేశాడు:

> నేను ప్రయాణము చేయుచు దమస్కునకు సమీపించినప్పుడు మధ్యాహ్న కాలమందు ఆకాశమునుండి గొప్ప వెలుగు అకస్మాత్తుగా నా చుట్టు ప్రకాశించెను. నేను నేలమీద పడి, “సౌలా, సౌలా, నీవెందుకు నన్ను హింసించుచున్నావని” నాతో ఒక స్వరము పలుకుట వింటిని. అందుకు నేను, “ప్రభువా, నీవెవడవని” అడిగినప్పుడు ఆయన, “నేను నీవు హింసించుచున్న నజరేయుడనగు యేసును” అని నాతో చెప్పెను. నాతో కూడ నున్నవారు ఆ వెలుగును చూచిరి గాని నాతో మాటలాడినవాని స్వరము వారు వినలేదు. అప్పుడు నేను – ప్రభువా, నే నేమి చేయవలెనని అడుగగా, ప్రభువు “నీవు లేచి దమస్కులోనికి వెళ్లుము; అక్కడ నీవు చేయుటకు నియమింపబడిన వన్నియు నీకు చెప్పబడునని నాతో అనెను.” ఆ వెలుగు యొక్క ప్రభావమువలన నేను చూడలేక పోయినందున నాతో కూడ ఉన్నవారు నన్ను నడిపింపగా దమస్కులోనికి వచ్చితిని.
>
> అంతట ధర్మశాస్త్రము చొప్పున భక్తిపరుడును, అక్కడ కాపురమున్న యూదులందరిచేత మంచిపేరు పొందినవాడునైన అననీయ అను ఒకడు నాయొద్దకు వచ్చి నిలిచి, “సౌలా! సహోదరా, దృష్టిపొందుమని” నాతో చెప్పగా ఆ గడియలోనే నేను దృష్టిపొంది అతని చూచితిని. అప్పుడతడు, “మన పితరుల దేవుడు తన చిత్తమును తెలిసికొనుటకును, ఆ నీతిమంతుని చూచుటకును, ఆయన నోటిమాట వినుటకును నిన్ను నియమించియున్నాడు; నీవు కన్నవాటిని గూర్చియు విన్నవాటిని గూర్చియు సకల మనుష్యులయెదుట ఆయనకు సాక్షివైయుందువు. గనుక నీవు

> తడవుచేయుట ఎందుకు? లేచి ఆయన నామమునుబట్టి ప్రార్థనచేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుమని చెప్పెను" (అపొస్తలుల కార్యములు 22:6-16).

పౌలుతో కూడనున్నవారు అతనిని పట్టణంలోనికి నడిపించారు, అక్కడ అతడు ప్రార్థించుచు మూడు దినములపాటు అన్నపానములు లేకయున్నాడు. మతపరంగా తాను తప్పులో ఉన్నాడని పౌలు బహు నిశ్చయముగా ఒప్పింపబడినట్టున్నాడు. తాను కాదని నిరాకరించినవాడు నిజంగా దేవుని కుమారుడన్న సంగతిని అతడు గ్రహించాడు.

దమస్కులోనికి వెళ్లితే తానేమి చేయాలో అక్కడ అతనికి చెప్పబడునని ప్రభువు అతనికి తెలిపాడు (11 వచనం). అననీయ ప్రభువును గూర్చి అతనితో మాట్లాడి దాన్ని అతడు యిలా తీర్మానించాడు, "నీవు తడవుచేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థనచేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుమని" చెప్పాడు (16 వచనం).

తన అనుభవానికి ప్రతిఫలంగా, పౌలు యేసునందు విశ్వాసముంచాడు. మూడు దినాలు ఉపవాసముతో ప్రార్థించడంలో మారుమనస్సుకు తగిన ఫలాలను అతడు కనుపరచాడు. అప్పుడతడు బాప్తిస్మం పొందాడు (9:18). బాప్తిస్మం యొక్క ఉద్దేశము అననీయ ప్రత్యేకించి తెలిపాడు. అది "పాపాలు ... కడిగివేసికొనుటకు."

"ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయువాడెవడో వాడు రక్షింపబడును" అని రోమా 10:13 చెప్పుతోంది. పౌలు మార్పు యొక్క ఉదాహరణలో, అలా వ్యక్తపరచినదాని యొక్క భావమేమో ఖచ్చితంగా ఏమైయుందో మనం చూస్తాం. పౌలు సువార్తకు లోబడి బాప్తిస్మం పొందినప్పుడు, అతడు "ఆయన నామమున ప్రార్థిస్తున్నాడు."